క్లుప్తంగా

సకల వసతులతో గ్రామీణ ప్రాంతాలు

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామీణ ప్రాంతాలు ప్రజలకు అవసరమైన అన్ని వసతులతో అభివృద్ధికి చిరునామాగా నిలుస్తున్నాయని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో మంగళవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను అందజేశారు. ప్రజలకు మంచి చేయటమే లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నల్లాని రమాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, నల్లాని సాయి, బండారుపల్లి కపిల్, నల్లాని అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా వెంకటేశ్వరుని శాంతి కల్యాణం



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలలో భాగంగా మూడవ రోజు మంగళవారం స్వామి వారికి శాంతి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు తిరునగిరి రామకృష్ణమాచార్యులు, పరాంకుశం వాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో అగ్నిధ్యానాలు, ప్రధాన హోమాలు, అభిషేకం, పవిత్రారోహణ, మహాశాంతి హోమాలు నిర్వహించారు. శేష వాహనంపై స్వామి వారి ఉత్సవ మూర్తులను ఉంచి శాంతి కల్యాణం చేశారు. కార్యక్రమంలో ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం ఉపేక్షించం

ఏసీపీ జనార్దన్ నాయుడు



నందిగామ(చందర్లపాడు): తిరునాళ్లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని ఏసీపీ జనార్దన్ నాయుడు సిబ్బందికి సూచించారు. చందర్లపాడు మండలం చింతలపాడు గ్రామంలో నూకాలమ్మ తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 28వ తేదీ వరకు జరగనున్న ఉత్సవాలకు అనేక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఈ నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. తిరునాళ్లకు ఏర్పాటు చేసిన పలు వినోద పరికరాలకు అనుమతులు లేవని వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో వాటిని తనిఖీ చేశారు. ఆయన వెంట రూరల్ సీఐ ఐవీ నాగేంద్ర కుమార్, ఎస్ఐ రామకృష్ణ ఉన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో రహదారుల అభివృద్ధి



జయంతి(వీరులపాడు): మండలంలోని ఆయా గ్రామాలలోని అంతర్గత రహదారులను ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి చేస్తామని ఎంపీపీ కోటేరు లక్ష్మి తెలిపారు. మండలంలోని జయంతి గ్రామంలో నూతనంగా చేపడుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని అన్ని అంతర్గత రహదారులను సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మారపాక మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనశైలికే 'ఆడుదాం ఆంధ్రా'

పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



చందర్లపాడులో క్రికెట్ ఆడి ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: క్రీడల ద్వారా గ్రామ స్థాయి నుంచి ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించటం, ప్రతిభను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా వారిని తీర్చిదిద్దేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ముందుగా పోటీలలో పాల్గొనే క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా గ్రామ, వార్డు సచివాలయాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కొద్దిసేపు వాలీబాల్ ఆడి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, ఎంపీపీ అరిగెల సుందరమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు గుడివాడ సాంబశివరావు, పాములపాటి రమేష్, షేక్ ఖాలిక్, బండారు గంగమ్మ, చిరుమామిళ్ల చైతన్యకుమార్, విశ్వనాథపల్లి కృపారావు, బండారు వెంకట్రావ్, బాపట్ల సాంబయ్య, కరి రవీంద్ర, జాఫర్, కమిషనర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

అంబారుపేటలో..

మండలంలోని అంబారుపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ అయిలపోగు రమ, నాయకులు అయిలపోగు రామయ్య, చిరుమామిళ్ల చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చందర్లపాడులో...

చందర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ఎమ్మెల్యే జగన్‌మోహనరావు ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని కొద్దిసేపు క్రికెట్ ఆడి సందడి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరి, జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, వైఎస్సార్ సీపీ నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు, వెలగపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్రా

జగ్గయ్యపేటఅర్బన్/జగ్గయ్యపేట: క్రీడా నైపుణ్యాలు, ప్రతిభ ఉన్నప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది క్రీడాకారులు గుర్తింపు లేకుండా అజ్ఞాతంలో ఉండిపోతున్నారని, అలాంటి వారందరినీ ప్రోత్సహించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్రా పోటీలను ఏర్పాటుచేసినట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నాయకులు కాశి కిషోర్, గోగుల వెంకయ్య, మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామ సచివాలయాలలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఘనంగా ప్రారంభించారు. చిల్లకల్లు, తిరుమలగిరి సచివాలయాల పరిధిలో పోటీలను మండల ప్రత్యేకాధికారి బాలాజీ ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులకు పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్‌బాబు, తహసీల్దార్ సూర్యారావు, ఎంఈవో చిట్టిబాబు, వైద్యాధికారి అనిల్, కార్యదర్శి నరసింహారావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతురాజు వసంతరావు, తాటి రామారావు, జనార్దన్, ఏడుకొండలు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అనుమంచిపల్లి, పోలంపల్లి, షేర్‌మహ్మద్‌పేట, అగ్రహారం, ముక్త్యాల, బూదవాడ, తక్కెళ్లపాడు గ్రామాలలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు క్రీడా పోటీలను ప్రారంభించారు. గండ్రాయి, గౌరవరం గ్రామాలలో పోటీలను కౌన్సిలర్ సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ ప్రారంభించారు.

వత్సవాయిలో...

స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీలను క్రీడల మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా సీతమ్మ, ఎంపీపీ కె.రమాదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు ఏసుపోగు దేవమణి, తహసీల్దార్ పి.వైకుంఠరావు, ఈఓపీఆర్డీ మాధవి, సొసైటీ అధ్యక్షుడు రంగిశెట్టి ముత్తేశ్వరరావు, ఉపసర్పంచ్ కె.వెంకటేశ్వర్లు, భూక్యా రాజా తదితరులు పాల్గొన్నారు.



పేటలో ఆడుదాం ఆంధ్రా ప్రారంభోత్సవంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు



తిరుమలగిరిలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

క్రీడల ప్రోత్సాహానికే 'ఆడుదాం..ఆంధ్రా'

పెనుగంచిప్రోలు: గ్రామీణ ప్రాంతాల్లో ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం..ఆంధ్రా పేరుతో క్రీడా పోటీలు నిర్వహిస్తోందని ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను మంగళవారం పండుగ వాతావరణంలో ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హర్షసాయి, ఎంఈవో డి.రవీంద్ర, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, కొణకంచి గ్రామ సర్పంచ్ గోనెల దేవి, ఆలయ డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు, అధికారులు, పీఈటీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

నందిగామ: నియోజకవర్గ వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు మంగళవారం ఉత్సాహభరితంగా సాగాయి. మండలంలోని మాగల్లు గ్రామంలో నిర్వహించిన పోటీలను కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ ప్రారంభించారు. అడవి రావులపాడు గ్రామంలో జరిగిన ఆటల పోటీలను వైస్ ఎంపీపీ ఆకుల రంగ, రుద్రవరంలో వైఎస్సార్ సీపీ నాయకుడు జిల్లేపల్లి రాము ప్రారంభించారు. ప్రతి సచివాలయం పరిధిలోను జరిగిన పోటీలను ఆయా గ్రామ ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి.

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేందుకే..

జుజ్జూరు(వీరులపాడు): గ్రామీణ ప్రాంత క్రీడాకారులను గుర్తించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ రమావత్ కోటి, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, వైస్ ఎంపీపీ షేక్ నాగుల్‌మీరా పాల్గొన్నారు.

కంచికచర్లలో...

కంచికచర్ల: మండలంలోని గండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీసభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచి బొక్కా రవికుమార్, ఎంపీటీసీ సభ్యురాలు పిల్లి భాగ్యరేణుక, సొసైటీ అధ్యక్షుడు మట్టా శ్రీనివాస రెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ డి.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మార్త శ్రీనివాసరావు, యద్దనపూడి విజయారావు, బి.సుబ్బారావు, పాపట్ల స్వామి, ఎంపీడీఓ కే శిల్ప, పరిటాల సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న పాల్గొన్నారు.

ముగ్గురమ్మల ఆలయంలో ప్రత్యేక పూజలు

నందిగామ: పట్టణ శివారు పల్లగిరి గుట్టపై గల త్రిశక్తి పీఠంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. మార్గశిర పౌర్ణమి నేపథ్యంలో ఆలయంలోని కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞాన సరస్వతి అమ్మవార్లకు వేకువజామునే ఆలయ అర్చకుడు రాజేష్ శర్మ పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. లోక శాంతిని కాంక్షిస్తూ పలు హోమాది కార్యక్రమాలు నిర్వహించారు.

బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షునిగా ప్రహ్లాద్

జగ్గయ్యపేటఅర్బన్: ఏపీ బీసీ సంఘం జగ్గయ్యపేట నియోజకవర్గ అధ్యక్షునిగా పట్టణానికి చెందిన కోసూరి ప్రహ్లాద్ నియమితులయ్యారు. ఈనెల 24 వ తేదీన మైలవరంలో జరిగిన బీసీ సంఘ సమావేశంలోత ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నట్లు ప్రహ్లాద్ మంగళవారం తెలిపారు.

ఈవీఎంలపై అవగాహన

కొత్తపేట(కంచికచర్ల): భారత ఎన్నికల సంఘం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం) ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు అనేక సంస్కరణలు ప్రవేశపెట్టిందని డెప్యూటీ తహసీల్దార్ షేక్ నాగుల్‌మీరా అన్నారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో ఈవీఎంల పనితీరు గురించి ఓటర్లకు మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచి ప్రత్తిపాటి సునీత, ఉపసర్పంచి ముప్పాళ్ల సత్యనారాయణ, నాయకులు ముప్పాళ్ల అప్పారావు, వీఆర్వో రామారావు, పోలీస్ సిబ్బంది, ఆపరేటర్, ఓటర్లు పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు

జగ్గయ్యపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నియోజకవర్గ వ్యాప్తంగా రహదారులపై ఉన్న గుంతలకు ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. పట్టణంతో పాటు జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలంలోని అన్ని గ్రామాలలోని రహదారులకు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను రోడ్లను పరిశీలించి, రహదారులు అధ్వానంగా ఉండటంతో వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో శరవేగంగా మరమ్మతు పనులు జరుగుతున్నాయి. షేర్‌మహ్మద్‌పేట-గండ్రాయి రహదారి రెండు కి.మీ మేర సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

ప్రజా నాయకుడు వంగవీటి రంగా

- నియోజకవర్గంలో ఘనంగా రంగా వర్ధంతి
- అన్నదానాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: వంగవీటి మోహన రంగా ఒక కులానికో, వర్గానికో చెందిన వారు కాదని అన్ని వర్గాలకు చెందిన ప్రజా నాయకుడని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. నందిగామ మున్సిపాలిటీ పరిధిలోని అనాసాగరం, పట్టణంలోని గాంధీ సెంటరులో రంగా వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అనాసాగరంలో రంగా విగ్రహానికి, గాంధీ సెంటరులో ఏర్పాటు చేసిన చిత్రపటానికి ఆయన పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాజకీయాలలోకి వచ్చిన అనతి కాలంలోనే వంగవీటి మోహనరంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. రంగాకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూడలేక హత్య చేయించింది ఏ పార్టీనో ప్రజలందరికీ తెలుసన్నారు. రంగా మృతికి కారణమైన పార్టీ నాయకులే నేడు ఆయన విగ్రహాలు, చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద బడుగు, బలహీన వర్గాలకు ఏ ఆపద వచ్చినా నేనున్నానని ముందుకు వచ్చే మానవతావాది రంగా అని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు అన్నారు. రంగా మృతి చెంది 35 ఏళ్లు అవుతున్నా ప్రజల హృదయాలలో ఇప్పటికీ జీవించే ఉన్నారని తెలిపారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకుడు పారుపల్లి హరిబాబు ఆధ్వర్యంలో గాంధీ సెంటరులో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, వైస్ ఎంపీపీ ఆకుల రంగ, నాయకులు పాములపాటి రమేష్, గుడివాడ సాంబశివరావు, కరి రవీంద్ర, ఆవుల రమేష్‌బాబు, చలమల మధు, చిరుమామిళ్ల చైతన్యకుమార్, సూరాకొండ, మందా మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు జాతి గర్వించే నేత రంగా

జగ్గయ్యపేటఅర్బన్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషిచేసిన వంగవీటి రంగా తెలుగు జాతి గర్వించే నేతగా ప్రతి పేదవాని గుండెల్లో నిలిచిన మహనీయుడని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువ నాయకుడు సామినేని వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. రంగా 35 వ వర్ధంతిని మంగళవారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ సేవా సమితి(కాపు సంఘం) ఆధ్వర్యంలో కోదాడ రోడ్‌లో ఉన్న రంగా విగ్రహానికి వెంకటకృష్ణ ప్రసాద్ పలువురు కాపు నేతలతో కలిసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ వంగవీటి రంగా ఒక కులానికో, వర్గానికో, ప్రాంతానికో చెందిన వ్యక్తి కాదని, ఆయన ఒక శక్తి అన్నారు. పేదల అభ్యున్నతి కోసం ఎన్నో ప్రజాపోరాటాలు చేసిన రంగాను నేటి యువత ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని సూచించారు. సేవాసమితి ప్రతినిధులు మాట్లాడుతూ ఏదైనా జిల్లాకు రంగా పేరు పెట్టాలని తీర్మానించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. శ్రీకృష్ణదేవరాయ సేవాసమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యలమంచి నాగరాజేంద్రప్రసాద్, ముత్యాల శేషు, కోశాధికారి కె.అమరనాథ్, గౌరవ అధ్యక్షుడు గోగుశెట్టి మహేష్, ఉపాధ్యక్షుడు వట్టెం మనోహర్, మాజీ అధ్యక్షుడు చిట్టిపోతుల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, న్యాయవాదులు పసుపులేటి సత్యశ్రీనివాస్, సామినేని రాము, గుంటక లక్ష్మీనారాయణ, సేవాసమితి ప్రతినిధులు కఠారి హరిబాబు, పందిటి కోటేశ్వరరావు, జియాలజిస్ట్ ధరణికోట రమణ, చౌడవరపు జగదీష్ పాల్గొన్నారు.



అనాసాగరంలో రంగా విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పేదలకు న్యాయం చేసే రంగాను పొట్టన పెట్టుకున్న టీడీపీ

కంచికచర్ల: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించటంతో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు పోరాటం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్ రంగాను నాడు టీడీపీ ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు అన్నారు. కంచికచర్ల నెహ్రూ బొమ్మ సెంటర్‌లో ఏర్పాటుచేసిన వంగవీటి మోహన్‌రంగా 35వ వర్ధంతి వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగింది. ముందుగా రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సెంటర్‌లో ఉన్న మాజీ సర్పంచులు కాలవ సీతారామయ్య, వేమా నరసింహారావు విగ్రహాలకు కూడా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం 3వేల మందికి అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో సర్పంచి వేల్పుల సునీత, ఎంపీటీసీ సభ్యులు నన్నపనేని నరసింహారావు, మాదుగుల మధుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కాలవ పెదబాబు, దాసరి రాము, దాసరి రాజా, కొత్తా కోటేశ్వరరావు, నారిశెట్టి శ్రీనివాసరావు, రంగా అభిమానులు నంబూరి నరసింహారావు, పుల్లగూర బాబు, దేవిరెడ్డి విష్ణుశ్వరరావు, యర్రంశెట్టి బాలయ్య, పసుపులేటి రాము తదితరులు పాల్గొన్నారు.



పేటలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్

వంగవీటికి ఘన నివాళి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా వర్ధంతి సందర్భంగా మంగళవారం రాధా రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో వైరా రోడ్డులోని రంగా విగ్రహానికి కౌన్సిలర్ సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మిత్ర మండలి సభ్యులు, కాపు నాయకులు పాల్గొన్నారు. గౌరవరంలో రంగా చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సయ్యద్ బాలసైదా, రాము, జగదీష్, మనోహర్, రాజేంద్ర, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వీరులపాడులో...

వీరులపాడు: వంగవీటి మోహనరంగా అట్టడుగు వర్గాల సమస్యల పరిష్కారంతో పాటు వారి అభ్యున్నతికి పాటుపడిన మహోన్నత వ్యక్తి అని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో వంగవీటి మోహనరంగా వర్ధంతిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలోని రంగా విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ రమావత్ కోటి, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, నాయకులు తమ్మిశెట్టి కొండలరావు, రమావత్ రాము, పూలా పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

- పెద్దాపురం గ్రామంలో వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి ఎంపీపీ కోటేరు లక్ష్మి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, నాయకులు ఆవుల రమేష్ బాబు, కోటేరు ముత్తారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.
- అల్లూరు గ్రామంలో మాజీ సర్పంచ్ కోటేరు సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో రంగా వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బందెల రాణి, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, నాయకులు బెల్లంకొండ నాగేశ్వరరావు, రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఆయా గ్రామాలలో వంగవీటి మోహనరంగా వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.

సొంతింటి కల సాకారం చేసిన సీఎం జగన్

- ఎస్టీ లబ్ధిదారులకు ప్రోత్సాహక నగదు చెక్కులు
- పంపిణీ చేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. చందర్లపాడు గ్రామంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎస్టీ లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు మంజూరైన ప్రోత్సాహక నగదు చెక్కులను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్టీ లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి ట్రైబల్ వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సహకారం అందిస్తోందన్నారు. దీనిలో భాగంగా ఒక్కొక్కరికి రూ.31 వేల చొప్పున 15 మంది లబ్ధిదారులకు రూ.4.65 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. జిల్లాలోనే మొదటి సారిగా చందర్లపాడు గ్రామంలోని ఎస్టీ లబ్ధిదారులకు ట్రైబల్ వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా ఇళ్ల నిర్మాణానికి ప్రోత్సాహక నగదు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, వెలగపూడి వెంకటేశ్వరరావు, శాఖమూరు వెంకట కుమారి, రాయల జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీ లబ్ధిదారులకు ప్రోత్సాహక నగదు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

డబుల్ ఎంట్రీలు లేకుండా చర్యలు

తహసీల్దార్ సూర్యారావు

జగ్గయ్యపేట అర్బన్: ఓటరు జాబితాల్లో డబుల్ ఎంట్రీలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఏఈఆర్‌వో), తహసీల్దార్ మన్నె సూర్యారావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో డబుల్ ఎంట్రీలు తొలగించాల్సిందిగా దాదాపు అన్ని పార్టీల వారు విజ్ఞప్తి చేయగా, డబుల్ ఎంట్రీలు, తప్పులు లేకుండా ఓటరు జాబితాలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల తహసీల్దార్లు వైకుంఠరావు, లక్ష్మీకల్యాణి, ఎలక్షన్ డీటీ కిషోర్‌బాబు, డీటీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు సీఎం జగన్ కృషి

డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు

కంచికచర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వెలుగు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. కంచికచర్లలో డ్వాక్రా మహిళలతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడత సొమ్ము జనవరి 10వ తేదీన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీఎం భాస్కరరావు, సీసీలు యశోద, రమణ, నరసింహారావు, లక్ష్మీకుమారి, బుక్‌కీపర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన 31 వాహనాలకు బుధవారం వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ కృష్ణబాబు మంగళవారం తెలిపారు. గ్రామంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న సంతలో ఉదయం 10 గంటలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో వేలం పాటలు జరుగుతాయన్నారు.

ఘనంగా దత్త జయంతి వేడుకలు

నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వర నగర్‌లో బాబా ఆలయంలో మంగళవారం దత్త జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని దత్తాత్రేయుడికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. దత్త చరిత్ర , గీతా పారాయణ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దత్త మాల మంత్రం ప్రచురణలను భక్తులకు పంపిణీ చేశారు.